క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



స్వప్నకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: మండలంలోని నరసింగపల్లి గ్రామానికి చెందిన స్వప్న అనే కేన్సర్ రోగి మెరుగైన వైద్యం కోసం గ్రామస్తులు, రాంబాబు చారిటబుల్ ట్రస్టు ద్వారా విరాళాలు సేకరించారు. సేకరించిన రూ.73,665 నగదును గ్రామ సర్పంచ్ రొౌతు జయమోహన్, గ్రామస్తులు పోలాకి వీరవసంత్, రట్టి శాంతారావు, నందిగాం జయరాం, సింహాద్రి గోవిందరావు తదితరులు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న స్వప్న వద్దకు వెళ్లి నగదును అందించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



నాగేశ్వరరావుకు పింఛన్ అందజేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి - గోవిందపురం పంచాయతీ సీతంపేట గ్రామానికి చెందిన హనుమంతు నాగేశ్వరరావు అనారోగ్యంతో విశాఖపట్నంలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆయనకు ఈనెల మంజూరైన పింఛన్ సొమ్మును సర్పంచ్ పాలిన చిరంజీవి, వలంటీర్ హనుమంతు కమల ఆస్పత్రికి వెళ్లి ఆదివారం అందజేశారు. దీంతో నాగేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామస్తులు వలంటీర్‌ను అభినందించారు.

'దుండగులను అరెస్టు చేయాలి'



నిరసన చేస్తున్న సమతా సైనిక్ దళ్ ప్రతినిధులు

టెక్కలి: ఉత్తరప్రదేశ్‌లోని సహారాన్‌పూర్‌లో సామాజిక కార్యకర్త, భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పులు జరిపిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని సమతా సైనిక్ దళ్ జిల్లా సమన్వయకర్త చల్లా రామారావు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లో దళితులపై దాడులు విపరీతంగా పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. బహుజనుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్న చంద్రశేఖర్ ఆజాద్‌పై ఇటువంటి దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో పి.చంటి, పి.నాగేశ్వరరావు, పి.ఆదవ్‌రావు, నీలాచలం, ఎ.మాధవరావు, ఎస్.ధనుంజయ్, రామోజీ, ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



గుంటు ధనరాజు

వజ్రపుకొత్తూరు: జిల్లాలో కిడ్నీ మహమ్మారి బారిన పడి మరణించినవారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా మత్స్యకార సెల్ కన్వీనర్ గుంటు ధనరాజు కోరారు. ఆదివారం పూండిలో ఆయన మాట్లాడుతూ.. ఉద్దాన, తీరప్రాంత గ్రామాల్లో కిడ్నీ రోగులు మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.700 కోట్లతో ప్రభుత్వం చేపడుతున్న శుద్ధ జల పథకం కిడ్నీ రోగులకు వరమే అయినప్పటికీ, మృతి చెందినవారి కుటుంబాలు రోడ్డున పడుతున్నారన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు.

పోస్టు మాస్టర్‌కి ఘన సన్మానం



హరిశ్చంద్రరావుని సన్మానిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

ఇచ్ఛాపురం: స్థానిక సబ్ పోస్టాఫీస్‌లో పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహించి గత నెల 30వ తేదీన పదవీ విరమణ పొందిన డి.హరిశ్చంద్రరావును స్థానిక కార్యాలయంలో తోటి ఉద్యోగులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, గుజరాతిపేట, పలాస, బారువ పోస్టాఫీస్‌ల పోస్టు మాస్టర్లు భానుప్రకాష్, వేణుగోపాల్, వెంకటరమణ, బర్రి సంతోష్ కుమార్, సోంపేట పీపీ కృష్ణకిశోర్, షణ్ముఖరావు, జ్ఞానవతి, దూదమ్మ, జయశ్రీ, రాజు తదితరులు పాల్గొన్నారు.



బావి వద్ద మంచినీటి కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు

నాడు



గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్

నేడు

తీరిన దాహార్తి..!

మెండుగా వర్షాలు కురిసినా.. దండిగా ఎండలు మండినా తాగునీటి తిప్పలు వాళ్లకి తప్పేవి కాదు. సముద్ర తీరం వెంబడి తీసుకున్న చెలమలు, బావుల నీటితోనే వాళ్ల గొంతు తడిచేది. ఇది నిన్నా.. మొన్నటి సమస్య కాదు. దశాబ్దాలుగా లక్ష్మీపురం గ్రామస్తులను వేధిస్తూనే ఉంది. అయితే ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో వాళ్ల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించింది. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌ల కృషితో సుమారు రూ.3.5 లక్షల వ్యయంతో గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను నెలకొల్పారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి మంచినీటికి కటకటలాడే తాము ఇప్పుడు శుద్ధ జలాన్ని వాడబోతున్నామని ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు. – ఇచ్ఛాపురం రూరల్

ఆధ్యాత్మిక కార్యక్రమాలు నేడు

మందస: మండలంలోని వీరగున్నమ్మపురం, పిడిమందస, కుంటికోట పంచాయతీల పరిధిలోని భల్లూకగిరిపై ఉన్న శ్రీరామానంద యోగాశ్రమంలో సోమవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వ్యాస పూర్ణిమ సందర్భంగా సత్సంగం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కోరారు. అలాగే మందస పట్టణంలోని షిరిడీ సాయి ధ్యాన మందిరంలో గురుపూర్ణిమతో పాటు 24వ వార్షికోత్సవం కూడా నిర్వహిస్తున్నామని వ్యవస్థాపక అధ్యక్షుడు గిన్ని తిరుపతిరెడ్డి చెప్పారు. చిన్నబరంపురంలో షిరిడీసాయి ధ్యాన మందిరంలో గురుపూర్ణిమ, వరసిద్ధి వినాయకస్వామి, సంజీవరాయ వీరాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు న్యాయవాది మెట్ట కృష్ణారావు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో చల్లదనోత్సవం



సోంపేట: జింకిభద్రలో అమ్మవారి చల్లదనం నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: గ్రామ దేవతలకు ప్రియమైన చల్లదన ఉత్సవాలు ఆదివారం మండలంలో అంబరాన్ని తాకాయి. సహజ ఫలాల నైవేద్యాలతో భక్తులు గ్రామ దేవతలకు మేళతాళాలు మధ్య మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నీలాపుపుట్టుగలో గ్రామస్తులు కాళీమాత ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాళీమాత వేషధారణలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మండలంలో బూర్జపాడు, కేశుపురం, సన్యాసిపుట్టుగ, పూరాణటకం, ధర్మపురం గ్రామాల్లోనూ ఈ ఉత్సవాలు జరిగాయి.

నింభాషిణీ అమ్మవారి చల్లధనం

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామంలో నింభాషిణీ అమ్మవారి చల్లధన మహోత్సవాన్ని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: నీలాపుపుట్టుగలో కాళీమాత చల్లదనం చేస్తున్న భక్తులు

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు లింగరాజు

టెక్కలి: సామాజిక సేవలో యువత భాగస్వాములు కావాలని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు పిలుపునిచ్చారు. స్థానిక రోటరీనగర్‌లోని సత్యసాయి శాంతి సుధా మందిరంలో జోనల్ యూత్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ చేయాలనే ఆలోచన కలిగిన యువతకు సత్యసాయి సేవా సమితి ఒక వేదికగా నిలుస్తుందన్నారు. సేవా సమితి ద్వారా ఎంతోమంది యువకులు విస్తృతంగా సామాజిక సేవలు చేస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం ఇటీవల జోనల్ కన్వీనర్‌గా నియామకమైన చంటిని సన్మానించారు. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా, జోనల్ సభ్యులు శివ, సాయి నిఖిల్, చంద్రమౌళి, మల్లేశ్వరరావు, అనాథగుప్త, నాగమణి, అన్నపూర్ణమ్మ, పి.కృష్ణారావు, నారాయణమూర్తి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళ్లను సంరక్షించుకోవాలి



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి ఒక్కరూ కళ్లను సంరక్షించుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి సూచించారు. మండలంలోని ఈదుపురం సత్యసాయి విద్యానికేతన్‌లో విజయనగరానికి చెందిన వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి నేతృత్వంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు డాక్టర్ సుజిత్, డాక్టర్ పవన్ కల్యాణ్‌లు 70 మంది రోగులను పరిశీలించి, ఉచితంగా మందులు అందజేయడంతో పాటు, 15 మంది రోగులను శస్త్ర చికిత్సకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్యాంపు కో-ఆర్డినేటర్ బి.నాగరాజు, హిందీ బాషోపాధ్యాయుడు నర్తు గంగయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బాగ జయపతి, తిప్పన దాలయ్యరెడ్డి, బోర చిన్నయ్య చంద్రశేఖర్, ఈశ్వరరావు, నీలాపు దేవరాజులు పాల్గొన్నారు.

ఘనంగా కొండమ్మ తల్లి ఉత్సవం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న యూనియన్ సభ్యులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కొండమ్మ ఉత్సవాన్ని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, యూనియన్ గౌరవ అధ్యక్షుడు శిష్టు గోపి గజముద్దను తలపై పెట్టుకుని, ఊరేగింపుగా అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యవర్గ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ నాయకులకు సన్మానం



ట్రస్టు ఆధ్వర్యంలో సన్మానం పొందుతున్న నాయకులు

మందస: మండలానికి చెందిన అగ్నికుల క్షత్రియ నాయకులను అగ్నికుల క్షత్రియ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం సన్మానించారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మీనారాయణ, న్యాయవాది దున్న లోకనాథం, క్లస్టర్ ఇన్‌చార్జి దున్న హరికృష్ణ, ఏజీకే మెంబర్ దున్న బుజ్జిలను జ్ఞాపికలతో రాష్ట్ర నాయకులు సత్కరించారు. అలాగే బొడ్డు చిన్నారావును జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఏజీకే ఛారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరామరాజు, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, అగ్నికుల క్షత్రియ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెయ్యి కోదండకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



రామయ్యపేటలో టీకాలు వేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మండలంలో కురుడు ఆర్‌బీకే పరిధిలోని చొదరికొత్తూరు, ఎరకయ్యపేట, రామయ్యపేట గ్రామాల్లో కురుడు పశువైద్యుడు లభినేని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచితంగా 132 జీవాలకు గొంతు వాపు, జబ్బవాపు నివారణకు టీకాలు ఆదివారం వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు చిరంజీవి, ముకుందరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా సబ్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆదివారం ఒక ప్రకటనలో అధికారులు ప్రకటించారు. 11 కేవీ లైన్ కండక్టర్ మారుస్తున్న సందర్భంగా సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆక్రమణలు తొలగింపు



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 7వ వార్డు చినబాడం గ్రామంలో పొర్లు కాలువపై అక్రమంగా చేపట్టిన కల్వర్టు నిర్మాణాన్ని అర్ధరాత్రి అనంతరం అధికారులు తొలగించారు. పలాస తహసీల్దార్ లంబాల మధుసూదనరావుకు రైతులు, ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేయడంతో, పట్టణ టీడీపీ అధ్యక్షుడు బడ్డ నాగరాజు చేపట్టిన ఆక్రమణలను తొలగించారు. చినబడం మాలబంధ నుంచి ఐదు అడుగుల వెడల్పుతో వస్తున్నటువంటి పొర్లు కాలువ సరియా గెడ్డలో కలుస్తుంది. దానిపై కల్వర్టు నిర్మాణం జరగడంతో రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగునీటికి ఇబ్బందులు పడే అవకాశం ఉందని, అందువలనే తొలగించామని తహసీల్దార్ పేర్కొన్నారు.

'ప్రజాపాటల పందిరి' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

పొందూరు: తాడివలస గ్రామంలో ప్రజా గాయకుడు, ప్రజా నాట్యమండలి కళాకారుడు పందిరి రాము రచించిన ప్రజా పాటల పందిరి పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఉద్యమ గీతాలు రచనలు చేయడం, అనర్గళంగా పాడటంలో పందిరి రాము పట్టు సాధించారు. రాము తమ గ్రామంలో పుట్టడం తమకెంతో ఆనందంగా ఉందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మణెమ్మ, విశ్రాంత ఆర్‌ఐవో భట్లు, విశ్రాంత అధ్యాపకులు అన్నా, రామానుజాచార్యులు, నీలంనాయుడు, విష్ణువర్ధనరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



దువ్వాడ వాణిని సత్కరిస్తున్న నాయకులు

టెక్కలి: నందిగాం మండలంలో పలువురు నాయకులను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ యర్ర విశ్వశాంతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యర్ర చక్రవర్తిలు ఆమెను సన్మానించారు. అనంతరం రానున్న ఎన్నికల్లో పార్టీ పటిష్టతపై చర్చించారు. ఆమెతో పాటు మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, నందిగాం మండల నాయకులు కె.నారాయణమూర్తి, జె.జయరాం, టి.పాల్గుణరావు, బి.మధు, పి.మోహన్‌రావు, శ్రీనివాస్, శ్యామ్‌నాయుడు తదితరులు ఉన్నారు.

ఘనంగా బి.సి.రాయ్ జయంతి



డాక్టర్ కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఐఎంఏ వైద్యులు

సోంపేట: సోంపేట, ఇచ్ఛాపురం, పలాస ఐఎంఏ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ బి.సి.రాయ్ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్య వృత్తిలో బి.సి.రాయ్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సీనియర్ వైద్యుడు డాక్టర్ యారాడి కృష్ణమూర్తిని సత్కరించారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ వైద్యవృత్తిలో పేద ప్రజలకు సేవ చేయడం ఆనందానిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ వైద్యులు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అప్పలరాజు, డాక్టర్ పి.శ్రీవాజి, డాక్టర్ దుర్యోధన, డాక్టర్ పి.రమేష్, మెడికల్ అసోసియేషన్ సిబ్బంది, ల్యాబ్ టెక్నిషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుత్రుడికి సాయం



కోదండరావుకు నగదును అందిస్తున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ ప్రతినిధులు



కోదండరావును సత్కరిస్తున్న వేదం ఫౌండేషన్ సభ్యులు

సాక్షి ఎఫెక్ట్

కవిటి: మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన మత్స్యకార యువకుడు గంటా కోదండరావు పైచదువుకు కావాల్సిన సాయంపై సాక్షి పత్రికలో 'సాయం కోసం సరస్వతీ పుత్రుడు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి దాతలు ఉదారంగా స్పందించారు. ఆదివారం కవిటి మండలానికి చెందిన డాక్టర్ అబ్దుల్‌కలాం ఫౌండేషన్ ప్రతినిధులు తమ సంస్థ తరపున రూ.13,000 ఆర్థిక సాయాన్ని వారి నివాసంలో కలిసి అందించారు. ఇంజినీరింగ్ చదువు సాగే నాలుగు సంవత్సరాలు కూడా తమ సంస్థ తరపున కచ్చితమైన సాయమందిస్తామని సంస్థ ప్రతినిధులు నర్తు సోమేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రవి, జానకిరావు, భగవాన్‌లు తెలియజేశారు. అదే విధంగా సోంపేటకు చెందిన వేదం ఫౌండేషన్ సంస్థ సభ్యులు రూ.10,000 ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వాడబలిజ చైతన్య వేదిక అధ్యక్షుడు జోగారావు, ఉపాధ్యక్షుడు ఢిల్లేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు కోదండరావును సత్కరించారు.



● ఉప్పొంగిన అభిమానం

మండలంలోని జాడుపుడి ఆర్ఎస్‌లో జి.బెలగాం గ్రామస్తుల ఆధ్వర్యంలో మద్దిలి ఈశ్వరరావు అధ్యక్షతన ఎమ్మెల్సీ నర్తు రామారావును ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించగా, స్థానికులు అభిమానంతో పూలు జల్లుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెలగాం పంచాయతీ అభివృద్ధికి చిత్తశుద్ధితో ముందుకు సాగుతామన్నారు. - కవిటి

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని బారువ గ్రామానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు ఇటీవల పదోన్నతులు పొందారు. దీంతో గ్రామంలోని ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు టి.ఆదినారాయణ, పి.హేమచంద్రరావు, డి.పరమేశ్వరరావు, కె.సర్వేశ్వరరావు, జి.ప్రేమనాథ్, కె.దేవేంద్రరావు, వి.శేఖరరావు, వి.సింహాచలంలను ఘనంగా ఆదివారం సన్మానించారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.